క్లుప్తంగా

భారీ వినాయక విగ్రహ నిమజ్జనం


క్రేన్, దోజర్లు, మెరైన్ సిబ్బందితో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

కొత్తపట్నం: ఒంగోలు నగరంలోని ఏనుగ చెట్టు ఆవరణలో 18 అడుగుల, ఐదు తలల వినాయక విగ్రహం ఆదివారం కొత్తపట్నం బీచ్ ప్రాంతానికి తరలించారు. గ్రామాల్లో విద్యుత్ లైన్లు నిలుపదల చేసి విగ్రహాన్ని అతి కష్టం మీద తీసుకొచ్చారు. మెరైన్ ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు. మెరైన్ సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా.. బోట్లు లాగే డోజర్లు, క్రేన్ సహాయం తీసుకున్నారు.

కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలి

ఒంగోలు టౌన్: పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు వారి స్థానంలో ఉపాధి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నిపాటి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు మస్టర్ పాయింట్ల వద్ద కాసేపు విధులను ఆపేసి నిరసన తెలిపారు. 2019 నుంచి నేటి వరకు 11 మంది కార్మికులు మరణించారని తెలిపారు. కార్మికుల కుటుంబాలకు 2 లక్షల రుపాయలు ఇవ్వాలని కోరారు. యు.రత్న కుమారి, కె.సామ్రాజ్యం, టి.విజయ, కె.మోహనరావు, ఆర్.రాములు, చిన్నబ్బాయి, అక్కేశ్వరరావు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా అంతర్జాతీయ పాస్టర్స్ డే

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్‌కాలనీలోని బిలీవర్స్ ఈస్టన్ చర్చిలో అంతర్జాతీయ పాస్టర్స్, ఫాదర్స్ డే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. చర్చి ఫాదర్ గుర్రం జాన్ బీ రంగయ్యను చర్చి సభ్యులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫాదర్ రంగయ్య మాట్లాడుతూ 30 ఏళ్లుగా పాస్టర్‌గా పనిచేస్తూ దేవునికి పరిచర్య చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అభినందనలు తెలిపిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక

పొదిలి: పొదిలి ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యద్దనపూడి బ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా షేక్.ఖాశిం, కోశాధికారిగా తోట సుబ్బారావు, కార్యదర్శిగా యడవల్లి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా ఎస్కే అబ్దుల్, గౌరవాధ్యక్షుడిగా నారిబోయిన సురేష్, గౌరవ సలహాదారులుగా గోనె భాను, కార్యనిర్వాహక సభ్యులుగా మహంత్ అశోక్ సింగ్, గల్లా కిషోర్, పాతకోట అశోక్, గురజాల సిద్దు, బట్టు శ్రీను, మాతంగి రమేష్, ధర్నాసి నరేంద్ర ఎన్నికయ్యారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి


ప్రధాని మోదీ సంతకంతో కూడిన సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

పుల్లలచెరువు: విద్యార్థులు చదువులపై ఒత్తిడిని జయించాలని కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లిల్లీ ప్రకాశ్‌వాణి సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన పరీక్షా పే చర్చా కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు మార్గం సుగమం చేయడమే పరీక్షా పే చర్చ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒత్తిడి చదువులతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చర్చా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రధాని సంతకంతో కూడిన సర్టిఫికెట్లు అందజేశారు.

ఘనంగా వైమానిక దళ దినోత్సవం


బహుమతులు అందిస్తున్న సంఘ సభ్యులు

ఒంగోలు సెంట్రల్: భారత వైమానిక దళ దినోత్సవం.. అంబేడ్కర్ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచంలో నాలుగో అతి పెద్ద వైమానిక దళంగా దేశానికి సేవలు అందిస్తున్న బలమైన చైతన్యవంతమైన వాయు సేన, సుఖోయ్, జాగ్వార్, మిగ్29తో పాటు, పలు క్షిపణులు కూడా ఇండియాలో తయారు అయిన వాటికి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉన్నట్లు పి. శ్రీనివాస రెడ్డి, జి. రజనీకుమారి, రవి, హరికుమార్ రెడ్డి, నాగేశ్వరరావు సేవలను వక్తలు కొనియాడారు. అమరులకు నివాళులర్పించారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. వెంకటరావు, వెంకటేశ్వర్లు, అనంత శర్మ, వెంకట రెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


మార్కాపురంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


దరిమడుగులో బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాల అనంతరం అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. నాగ శిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

దరిమడుగులో పోలేరమ్మ జాతర

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో గ్రామదేవత పోలేరమ్మ జాతరను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించారు.

పోలేరమ్మా దీవించమ్మా..

కొనకనమిట్ల: మహాలయ పక్షాన్ని పురస్కరించుకుని మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఆదివారం పోలేరమ్మతల్లి ఉత్సవం నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారికి పూజలు చేశారు.


గొట్లగట్టులో పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులు

అంకాళమ్మకు ప్రత్యేక పూజలు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామ ప్రజల ఇలవేల్పు అంకాళమ్మతల్లికి ఆదివారం పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

చిన్న ఓబినేనిపల్లెలో పోలేరమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు


గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న కుంకుమ బండ్లు

- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: మండలంలోని చిన్న ఓబినేనిపల్లెలో ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతరలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. పోలేరమ్మ, గంగమ్మలకు పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి బోనాలు ఎత్తుకుని కుంకుమబండ్లతో ఊరేగింపుగా పోలేరమ్మ, గంగమ్మ ఆలయాల వద్దకు తరలివెళ్లారు. అమ్మవార్లకు మొక్కులు తీర్చుకుని బోనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రామసేతు శిలా రథ గ్రామోత్సవం


గ్రామోత్సవానికి వచ్చిన రామసేతు, ఆంజనేయస్వామి విగ్రహం


స్వామివార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

కురిచేడు: అయోధ్య రామ మందిర నిర్మాణానికి సంబంధించిన రామసేతు శిలా విగ్రహం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాల గ్రామోత్సం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. రామ మందిర నిర్మాణం సందర్భంగా ఏర్పాటు చేసిన రథం ఆదివారం సాయంత్రం కురిచేడు చేరింది. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయం వద్ద పూజారి నారాయణం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఎస్సై ఎం. దేవకుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులు, వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్త వెంకట అయ్యపుశెట్టి, రావూరి కృష్ణారావు, కొప్పురావూరి కిశోర్, పువ్వాడ సుజాత, కురంగి నాగేశ్వరరావు, దూలంవెంకటరెడ్డి, మహిళా సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కంభం: లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా మొఘల్ మహబూబ్ బేగ్, కార్యదర్శిగా వితా వెంకట శ్రీనివాసరావు, కోశాధికారిగా తన్నీరు బాలరంగారావులచే లయన్స్‌క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ పులి శ్రీనివాస ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తమ పదవీకాలంలో నాణ్యమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సేవా కార్యక్రమాల కోసం తమవంతు సాయంగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని మొగల్ చిన్నహుస్సేన్‌బేగ్ ప్రకటించారు. ఇటీవల ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడిగా ఎంపికైన నరాళ ఈశ్వరరెడ్డిని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీసభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, క్లబ్ సభ్యులు సోమయ్య, బీవీ రామక్రిష్ణ, మహబూబ్ బాష, కేశవ, కాశయ్య, మహబూబ్‌పీరా, పాల్గొన్నారు.

మైనంపాటి సాయికి శ్రీశ్రీ కళా వేదిక సత్కారం


మైనంపాటి సాయిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ గిడుగు పురస్కార గ్రహీత ఎర్ర సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్‌ను ఆదివారం నరసరావుపేటలో జరిగిన పల్నాడు కవితోత్సవంలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సాహిత్య సేవలను కొనియాడారు. రామిరెడ్డి పేట రాధా సుందరం కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కమిటీ సభ్యులు అభినందించారు. శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు.

ముస్లింల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న ముస్లింలు

గిద్దలూరు రూరల్: ముస్లిం మైనార్టీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ముస్లిం మైనార్టీల సంఘం అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాష కోరారు. పట్టణంలోని కొంగలవీడు రోడ్డులోని బిలాల్ మసీదు ఆవరణలో ఆదివారం నియోజకవర్గ మైనార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల్లోని ఇమామ్‌లకు, మౌజన్ల వేతనాల కోసం అర్జీలు దాఖలు చేసిన వారికి వెంటనే చెల్లించాలని, మసీదులకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ముస్లిం స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు హుస్సేన్, పీరా, చాంద్‌బాష, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

'బండారు' దిష్టిబొమ్మ దహనం


బండారు సత్యనారాయణ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెద్దారవీడు: రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కే రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియ మండల కన్వీనర్లు డిమాండ్ చేశారు. మండలంలోని దేవరాజుగట్టు జంక్షన్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు మాజీ మంత్రి బండారు సత్యనారాయణ దిష్టిబొమ్మను ఆదివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండారు సత్యనారాయణ క్షమాపణ చెప్పనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ సోషల్ మీడియ కో కన్వీనర్లు ఖాసింబాషా, నాగరాజు, సొంటి నాగార్జునరెడ్డి, సభ్యులు వాసు, బాస్కర్, అంకయ్యయాదవ్, నరసింహ, ఖాజా, రవి, యూసుఫ్, శివారెడ్డి, వెంకటయ్య, చెన్నయ్య, ఇమామ్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామయ్యకు బాలినేని పూజలు


ఆశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు మెట్రో: స్థానిక సత్యనారాయణపురం దిబ్బల రోడ్డు లోని రామాలయం వారి వీధిలో శ్రీ అనంత కోదండరామ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయాన్ని ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సందర్శించి సీతారాముల వారి పూజలో పాల్గొన్నారు. ముందుగా అర్చక స్వాములు బాలినేని శ్రీనివాస్ రెడ్డిని వేద మంత్రాలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, స్థానిక నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వర్గీకరణపై బీజేపీ నాటకం


సంతనూతలపాడులో మాట్లాడుతున్న బిళ్ళా వసంతరావు

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ నాటకమాడుతోందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్ళా వసంతరావు కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలను చైతన్యం చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి సంతనూతలపాడు వచ్చారు. కమ్యూనిటీ హాలులో స్థానిక మాలలతో సమావేశమయ్యారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మాదిగల ఓట్ల కోసం ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీని వేస్తామంటూ బీజేపీ నాటకమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. జిల్లా, మండల నాయకులు బత్తుల శ్రీనివాసరావు, ఆరేటి కిరణ్‌కుమార్, అల్లడి రవి, చీకటి చిరంజీవి, ఏడుకొండలు, శేషయ్య, సాయి, శింగయ్య పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు


33వ డివిజన్‌లో చెత్త సేకరణ పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: రోడ్ల మీద భవన నిర్మాణ, ఇతర వ్యర్థాలు పడేస్తే చర్యలు తీసుకుంటామని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం 33వ డివిజన్‌లోని పెద్ద డొంక, మిలటరీ కాలనీల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. చెత్తను నెట్టుడు బళ్ల వద్ద కానీ, క్లాప్ ఆటోలకు కానీ ఇవ్వాలని ప్రజలకు సూచించారు. తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌కు, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు పంపిస్తామని తెలిపారు. మూడు బుట్టల చెత్త సేకరణ విధానాన్ని శానిటరీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కమిషనర్ వెంట 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంతా భాస్కరరెడ్డితో పాటు శానిటేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గోరేకు టీవీ మెకానిక్‌ల నివాళి


గోరే మృత దేహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో మరణించిన పఠాన్ మహమ్మద్ ఖాన్ ఉరఫ్ గోరేకు నగరంలోని టీవీ మెకానిక్‌లు నివాళి అర్పించారు. ఆదివారం ప్రకాశం జిల్లా ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ యూనియన్ నాయకుడు గోరే మృతదేహాన్ని సందర్శించి కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. 11వేల రుపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు మార్నెళ్ల సుబ్బారావు, పీవీ శేషయ్య, బి.రాజు, కోనంగి చిరంజీవి, ఎం.శ్యాముల్, శివపార్వతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, ప్రముఖ వైద్యులు కొల్లా నాగేశ్వరరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమూద్ అబ్దుల్, సీపీఎం నాయకులు వై.సిద్దయ్య, జాల అంజయ్య, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ కార్యదర్శి భక్త సింగ్, జలీల్, కరిముల్లా హాజరయ్యారు.

కంప్యూటర్ క్లౌడ్‌కు డిమాండ్


మాట్లాడుతున్న టెక్ మహీంద్ర క్లౌడ్ లీడ్ వంశీ కృష్ణ

ఒంగోలు సెంట్రల్: కంప్యూటర్ క్లౌడ్ టెక్నాలజీలో విద్యార్థులు నైపుణ్యతను సాధిస్తే భవిష్యత్‌కు ఢోకా ఉండదని జర్మన్ కంపెనీకి చెందిన టెక్ మహీంద్ర క్లౌడ్ లీడ్ వంశీకృష్ణ ఎం. అన్నారు. ఒంగోలు పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆదివారం సీఎస్‌సీ, ఐటీ విభాగాలకు చెందిన విద్యార్థులకు క్లౌడ్ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లౌడ్ టెక్నాలజీ గురించి అందులో ఉన్న అవకాశాల గురించి వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, కన్వీనర్ శ్రీనివాసరావు, గౌరీ శంకర్, రాజేశ్వరి, శిరీష పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించండి


మాట్లాడుతున్న యూటీఎఫ్ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: యూటీఎఫ్ జిల్లా శాఖ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం సంఘ అధ్యక్షుడు ఏపీ వీరా రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆగిన పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించి హైస్కూల్ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కొందరి ఉపాధ్యాయులకు టెక్నికల్ సమస్య వలన జీతాలు రావటం లేదని సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వీరా రెడ్డి, రవి, వీరాంజనేయులు, కేశవ రాజు, అబ్దుల్, ఉమామహేశ్వరి, చిన్న స్వామి, రాజేశ్వరావు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

దర్శి: ఏపీటీఎఫ్ దర్శి నూతన శాఖ కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు వి. చక్రధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దర్శి నూతన అధ్యక్షునిగా జి. రంగస్వామి, ఉపాధ్యక్షుడు తూము శ్రీనివాసరావు, ఎం. రఘురామిరెడ్డి, బీవీ నారాయణ, ఎస్‌కే షాహిన్ షా బేగం, ప్రధాన కార్యదర్శి ఎస్. కోటేశ్వరరావు, కార్యదర్శులుగా కె. హరిప్రసాద్, బండారు వెంకటేశ్వర్లు, ఐవీఎల్ నారాయణ, బి. రంగారావు, సీహెచ్ వరలక్ష్మీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి ఎస్. జాన్, ఏ. ప్రసాద్, సీహెచ్ శివ రామకృష్ణ పాల్గొన్నారు.